క్లుప్తంగా

నేడు వీఎంసీ స్పందన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వీఎంసీ నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరుగుతుందని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు నగరంలోని మూడు సర్కిళ్లలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని, ఆయా కార్యాలయాల్లో అధికారులు నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరిస్తారని చెప్పారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయో వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా అన్నయ్య ఛారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ బి.సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధులకు ప్రతి నెలా నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేయడం అభినందనీయమన్నారు. గౌరవ అతిథి కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అర్పిత్‌జైన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటివారికి సేవ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ్వీ జ్యూయలర్స్ అధినేత వికాస్‌సంఘ్వీ, దాత మంగ్లాబాయి, అంబాలాల్‌జీ సంఘ్వీ, ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్‌సోలంకీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెనరా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): కెనరా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాక్‌థాన్‌ను ఆలిండియా కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రవికుమార్ బెలూన్‌లను ఎగురవేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కెనరా బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తోందని తెలిపారు. అందరికీ విద్య, సాంఘిక సంక్షేమం, కస్టమర్ సర్వీస్‌లకు అనుగుణంగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వాక్‌థాన్‌లో కెనరా బ్యాంక్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: మోహన్‌కృష్ణా ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన తెలుగు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. మోహన్‌కృష్ణా ఆర్ట్స్ కార్యదర్శి బీ ఆశయ్య ఆధ్వర్యంలో గాయనీ గాయకులు రసూల్‌బాబు, వీరాంజినాయక్, శివనాగలక్ష్మి, లావణ్యారాజీ, రూపాశ్రీ గీతాలను ఆలపించారు. సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీబాయి మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సంస్థ కోశాధికారి బి.మోహన్‌కృష్ణ నాయక్ నిర్వహించారు.

ట్రాఫిక్... నో ఫికర్

- నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- వీఎంసీ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతకు మూడు టీములు ఏర్పాటు
- 10 ప్రాంతాల్లో అత్యంత ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్లు గుర్తింపు
- ప్రమాదాల నివారణకు బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



విజయవాడ కృష్ణలంక హైవే నుంచి బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్ ఎక్కే మార్గంలో గుర్తించిన బ్లాక్ స్పాట్

పటమట(విజయవాడతూర్పు): పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీ కూడా పెరుగుతోంది. ఓ వైపు వాహనాల సంఖ్య పెరగటం.. మరోవైపు అదే స్థాయిలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతూ వస్తున్నాయి. నానాటికీ పెరుగుతున్న ప్రమాదాలను నిరోధించేందుకు.. జటిలంగా మారుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రయాణం సజావుగా సాగేందుకు వీఎంసీ చర్యలు చేపట్టింది. ఈ మేరకు వీఎంసీ, పోలీస్, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, విద్యా విభాగం, రోడ్డు ట్రాన్స్‌పోర్టు విభాగాలతో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నేతృత్వంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఇప్పటికే రెండుమార్లు ఆయా విభాగాల అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయా విభాగాల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి రోడ్డు భద్రతకు ప్రణాళికను రూపొందించింది. మూడు సర్కిళ్లకు ఆయా విభాగాల నుంచి అధికారులు, సిబ్బంది సర్వే చేసి సర్కిళ్ల వారీగా నివేదిక రూపొందించారు. మూడు సర్కిళ్ల పరిధిలో గుర్తించిన ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయటానికి రూ.44.35 లక్షలు వీఎంసీ వెచ్చిస్తోంది. ట్రాఫిక్ సిగ్నళ్లు, రోడ్డు సేఫ్టీ సైన్ బోర్డులు, పేవ్‌మెంట్ మార్కింగ్‌కు ఆయా ప్రాంతాల్లో రూ.89.42 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇందుకు ఇటీవల జరిగిన వీఎంసీ స్థాయీసంఘంలో కూడా ఆమోదం లభించింది.

రోడ్డు ప్రమాదాల నిరోధానికి తీసుకునే చర్యలు

నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, మత స్థలాలు, మార్కెట్లు, జనసాంద్రత కలిగిన ప్రాంతాలు గుర్తించారు. వాటిలో సర్కిల్–1 పరిధిలో 28, సర్కిల్–2 పరిధిలో 16, సర్కిల్–3 పరిధిలో 28 ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సైన్‌బోర్డులు, గమనిక బోర్డులు, స్టాపర్లు, స్పీడ్‌బ్రేకర్లు, బ్లింకర్లు, వైట్‌లైన్లు, జీబ్రా లైన్లు వేయటం, రంబల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయటం, జీబ్రా క్రాసింగ్ సిగ్నళ్లు ఏర్పాటు చేయటం, సెంట్రల్ స్ట్రీట్‌లైట్లు పునరుద్ధరించటం, రోడ్డు మరమ్మతులు చేస్తారు.

గుర్తించిన బ్లాక్‌స్పాట్లు :

- సర్కిల్ 1 ఏరియాలో మొత్తం 15 బ్లాక్‌స్పాట్లు గుర్తించగా అందులో అత్యంత ప్రమాదకరమైన కబేళా జంక్షన్, తారాపేట(నెహ్రూ రోడ్డు), వాగు సెంటర్(కొత్తపేట), చిట్టినగర్(కేటీరోడ్డు), విజయ డెయిరీ(కేటీరోడ్డు), శివాలయం జంక్షన్‌లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో రూ.31.66 లక్షలతో ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు, స్పీడ్‌బ్రేకర్లు, డివైడర్లు ఏర్పాటు చేయనున్నారు.
- సర్కిల్ 2 పరిధిలో మొత్తం 5 బ్లాక్ స్పాట్‌లు గుర్తించగా వాటిలో ప్రమాదకరమైనవి గవర్నమెంట్ ప్రెస్, సీకే రోడ్డు ప్రమాదభరితమైన ప్రాంతాలుగా గుర్తించారు. ఇక్కడ ప్రమాదాల నిరోధానికి 43.85 లక్షలతో ట్రాఫిక్ నియంత్రణ బోర్డులు ఇతరత్రా ఏర్పాటు చేయనున్నారు.
- సర్కిల్ 3 పరిధిలో రెండు బ్లాక్‌స్పాట్లు గుర్తించగా కొత్త ప్రభుత్వాసుపత్రి వద్ద డెంటల్ కాలేజీకి వెళ్లే రోడ్డు, మహానాడుకు వెళ్లే రోడ్డును బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. స్క్రూబ్రిడ్జి వద్ద ఫ్లైవోవర్ వద్ద ఎక్కే సమయంలోనూ, దిగే ఫ్లైవోవర్‌ను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు.



విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని హైవే నుంచి మహానాడు రోడ్డు వెళ్లే మార్గంలో గుర్తించిన బ్లాక్ స్పాట్

నగరంలో నూతన బస్‌షెల్టర్లు

సర్కిల్ 1 పరిధిలో మూడు బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. చిట్టినగర్ జంక్షన్, కాశేశ్వరరావు మార్కెట్ జంక్షన్ వద్ద, సర్కిల్–2 పరిధిలోని కండ్రిక జంక్షన్, సర్కిల్–3 పరిధిలో రమేష్ ఆస్పత్రి జంక్షన్, కొత్త ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నూతనంగా బస్‌షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్తీ విజయవాడ ప్రజారోగ్య – జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన పాయకాపురం లహరి స్కూల్లో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ చేకూరి మురళి బీపీ, షుగర్, పిట్స్, పక్షవాతం వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రెండు వందలకే అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్వహించే వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ తెలుగు బాప్టిస్ట్ చర్చి 60వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రెవ.ఎం.జ్యోతిరాజు, రెవ.షేక్ మక్బుల్‌లు వాఖ్యపరిచర్య చేశారు. ముందుగా చర్చి యూత్ కమిటీ సభ్యులు, సండే స్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సంఘకాపరి రెవ.కొమ్ము హోసన్న, తెలుగు బాప్టిస్ట్ చర్చ్ కమిటీ పెద్దలు మామికర్ల డానియేల్, పల్లె ప్రకాశరావు, కంభగళ్ల పాపారావు, విశ్వనాథపల్లి జవహర్‌బాబు, పూనూరి జోసఫ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యాధరపురం ఆర్టీసీ బస్‌డిపోలో పని నేర్చుకోవడానికి వెళ్లిన తన కొడుకు ఇంటికి తిరిగి రాలేదని తండ్రి షేక్ బాబు సాహెబ్ ఆదివారం నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాయకాపురంకు చెందిన షేక్ ఖుదాన్‌సాహెబ్(27) ఐటిఐ పూర్తి చేసి పని నేర్చుకోవడానికి విద్యాధరపురం ఆర్టీసీ డిపోకి వెళ్తున్నాడు. శనివారం మధ్యాహ్నం డ్యూటీకని వెళ్లిన ఖుదాన్‌సాహెబ్ ఇంటికి తిరిగి రాలేదని, ఫోన్ చేస్తే స్విచ్ఆఫ్ అయినట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భావ వ్యక్తీకరణకు చిత్రలేఖనం దోహదం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మనిషిలోని భావాలను వ్యక్తపరచడానికి చిత్రలేఖనం దోహదం చేస్తుందని ఆదాయపు పన్ను శాఖ రిటైర్డ్ కమిషనర్ కూరపాటి అజయ్‌కుమార్ అన్నారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ, అనంత్ డైమండ్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ (స్పా) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న జరిగిన డ్రాయింగ్ పోటీలలో విజేతలకు ఆదివారం స్పా కళాశాల ఆవరణలో బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ప్రతిభ ఉంటుందని, దానిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తే పిల్లలు ఆ రంగంలో అగ్రస్థాయికి చేరతారన్నారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సిరికొండ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు డ్రాయింగ్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. అనంత్ డైమండ్స్ అధినేత జాస్తి అనంత పద్మశేఖర్ మాట్లాడుతూ డ్రాయింగ్ ద్వారా చిన్నారుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు పి.రమేష్ మాట్లాడుతూ చిన్నారుల్లో డ్రాయింగ్‌పై మక్కువ పెంచడానికి తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వీజీఎస్ పబ్లిషర్స్ అధినేత నారాయణరావు, స్పా కళాశాల స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ ఎస్.వెంకట కృష్ణ కుమార్, రాజమండ్రి చిత్ర కళానికేతన్ కార్యదర్శి టి.మృత్యుంజయ రావు, అమరావతి విజువల్ ఆర్ట్ సొసైటీ కోశాధికారి వి.వీరయ్య, జిజ్ఞాస ఇంటర్ ఫేస్ ప్రయివేట్ లిమిటెడ్ చైర్మన్ వై.భార్గవ్, ఎస్.రవికుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు. సభకు ముందుగా అతిథులను నిర్వాహకులు సత్కరించారు. అనంతరం డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.



బహుమతులను అందజేస్తున్న అతిథులు

ఆది దంపతుల ఆర్జిత సేవలకు డిమాండ్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవలకు డిమాండ్ అధికంగా ఉంది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉత్సవ మూర్తి వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణంతో పాటు చండీహోమాల్లో ఉభయదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇక మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, త్రికాల అభిషేకాలతో పాటు సహస్ర లింగార్చన, సాయంత్రం ఊంజల్ సేవ, దీపార్చన, పల్లకీ సేవల్లో కూడా భక్తులు భారీగా పాల్గొన్నారు.

సూర్యోపాసన సేవ

అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరిక

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పెద్ద సంఖ్యలో నాయకులు, శ్రేణులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 60వ డివిజన్‌కి చెందిన ఎండీ సలీంతో సహా 20 బీజేపీ కుటుంబాలు ఎమ్మెల్యే మల్లాది విష్ణు సమక్షంలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని కార్యాలయంలో ఎమ్మెల్యే వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రంలోని అన్ని వర్గాలు, ప్రాంతాల శ్రేయస్సు కోరుకునే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని పేర్కొన్నారు. సీఎం జగన్ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తికరంగా ఉన్నారని తెలియజేశారు. మరో 30 ఏళ్లు ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ముఖ్యమంత్రి అని ఆయన చెప్పారు. డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ముస్లిం మైనార్టీలకు తోడుగా ఉండాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) సభ్యులందరిపై ఉందని ముస్లిం మైనార్టీలకు తోడుగా ఉండాలని ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. సింగ్‌నగర్‌లోని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యాలయంలో కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. దీనిలో పాల్గొన్న నాగుల్‌మీరా మాట్లాడుతూ వచ్చే జనవరి 21న కమిటీ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనికి ప్రభుత్వంలోని పెద్దలు, రాష్ట్రంలోని ముస్లిం మత పెద్దలు పాల్గొంటారని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన షేక్ అబ్దుల్‌గఫార్‌ను రాష్ట్ర కమిటీ సభ్యునిగా, అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన షేక్ అబ్దుల్‌అజీజ్‌ను ఆ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ వారికి నియామక పత్రాలు అందించారు. సమావేశంలో ఏఎంసీ నాయకులు సాజిద్‌అలీ, బిల్డర్ నాగుల్‌మీరా, ఇమ్రాన్, హుస్సేన్, మస్తాన్, రఫీ, ఇంతియాజ్, గౌస్, మునీర్‌అహ్మద్, రహీంఖాన్, అబ్దుల్‌రహీం తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న నాగుల్‌మీరా

నిజాయితీ, నిబద్ధత గల నాయకురాలు కరీమున్నీసా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజా జీవితంలో నిజాయితీ, నిబద్ధత గల నాయకురాలిగా మాజీ ఎమ్మెల్సీ ఎండీ కరీమున్నీసా మంచి పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్‌లు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎండీ కరిమున్నీసా ద్వితీయ వర్ధంతి కార్యక్రమం సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముందుగా ఎమ్మెల్సీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, కో–ఆప్షన్ సభ్యులు అలీంతో కలిసి కరీమున్నీసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి జగనన్న వెంటే కరీమున్నీసా కుటుంబం నడిచిందని పేర్కొన్నారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు, పేద మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు అమిర్‌సయ్యద్, అక్బర్, ముఫ్తీ హబీబ్‌అహ్మద్, ఎండీ హఫీజుల్లా, షేక్ అమిత్, రెహ్మాన్, కృష్ణ, రమేష్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు,వెల్లంపల్లి శ్రీనివాస్

మదరసా నిర్మాణానికి శంకుస్థాపన

పాయకాపురం(విజయవాడరూరల్): పైపులరోడ్డు–అంబాపురం గ్రామ సరిహద్దులో మస్జీద్ ఎ కరీమున్నీసా మదరసా నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన జరిగింది. ముస్లిం మత గురువులు ప్రత్యేక దువా అనంతరం హాజి మొహమ్మద్‌సలీం కుటుంబ సభ్యులతో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు.

చేయూత మానసిక వికలాంగుల శిక్షణా సంస్థ వార్షికోత్సవ వేడుకలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక అయోధ్యనగర్‌లో చేయూత మానసిక వికలాంగుల శిక్షణా సంస్థ 17వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎస్పీ వీవీ నాయుడు మాట్లాడుతూ ప్రత్యేక చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఫిజియోథెరపీ ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ప్రత్యేక చిన్నారులకు 17 సంవత్సరాలుగా విశేషసేవలు అందిస్తున్న చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ సేవలు నిరుపమానమని కొనియాడారు. ప్రత్యేక చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రత్యేక చిన్నారులు భారీ కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, డిపార్ట్‌మెంట్ ఆఫ్ వెల్ఫేర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ అడిషనల్ డైరెక్టర్ వీ కామరాజు, సంస్థ డైరెక్టర్ డాక్టర్ టీ కృష్ణకుమారి, వ్యాపారవేత్త ఆంజనేయులు, వెల్కో ఇన్‌ఫ్రాటెక్ డైరెక్టర్ అభిజ్ఞ, ప్రత్యేక చిన్నారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ ఇందిరా నాయక్‌నగర్‌లోని అయ్యప్పస్వామి వారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. గురుస్వాములు రాధాకృష్ణ, శేషుల శిష్య బృందం ఆధ్వర్యంలో స్వామి వారికి 18 రకాల పూలతో పుష్పాభిషేకం చేశారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొన్నారు. ఇప్పిలి శ్రీను, రత్నం, విశ్వనాథ గురుస్వామి, చంద్రమౌళి, కరణం తిరుపతి, హరినాథ్‌స్వామి, రమేష్, సూరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

దిశ, పోక్సో చట్టాలపై అవగాహన



దిశ చట్టంపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాది అయ్యప్ప



కార్యక్రమంలో పాల్గొన్న ఉషారాణి, వాణిశ్రీ, అరుణ, కృష్ణప్రియ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థినులకు దిశ, పోక్సో, సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. తొలుత గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ, హైకోర్టు న్యాయవాది అయ్యప్ప ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో అయ్యప్ప మాట్లాడుతూ దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దిశ, పోక్సో చట్టాల ప్రయోజనాలు, బాధితులు ఏ విధంగా వాటిని వినియోగించుకోవాలో వివరించారు. అనంతరం మహిళలకు రంగవల్లుల పోటీ, మ్యూజికల్ చైర్స్ పోటీలు, ఏక్ మినిట్ గేమ్ వంటివి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి, వెటర్నరీ డీడీ దత్త, చిరంజీవి, గ్రంథాలయ సిబ్బంది జి.ఉమారాణి, వై.ధనలక్ష్మి, డి.రమేష్, రాంబాబు, శంకర్, కుమార్ పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక రామకృష్ణాపురం శ్రీ కళ్ళేపల్లి శేషంరాజు స్మారక గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం జరిగాయి. ఇందిరా మహిళా మండలి అధ్యక్షురాలు మాధవీలత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించిన ఏపీ లక్ష్మి, హెడ్‌నర్స్ పద్మ, మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మహిళా మండలి నాయకులు వాగ్దేవు లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మహిళా విజయాన్ని స్వాగతించాలి

విజయవాడ కల్చరల్: మహిళలు అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నారని వారి విజయాలను స్వాగతించాలని సామాజిక వేత్త ఉషారాణి అన్నారు. హనుమంతరాయ గ్రంథాలయంలో 56వ గ్రంథాలయ వార్షికోత్సవం సందర్భంగా మహిళా చైతన్యం ఏది? ఎక్కడ అంశంగా ప్రత్యేక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఉషారాణి మాట్లాడుతూ మహిళా చైతన్యానికి ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు, సామాజిక అంశాలు, స్వేచ్ఛ చాలా అవసమని పేర్కొన్నారు. కవయిత్రి నైనాల వాణిశ్రీ ఆదిమ యుగంలో స్త్రీ, పురుషుల్లో అసమానత్వం లేదన్నారు. హనుమంతరాయ గ్రంథాలయ నిర్వాహకులు కృష్ణప్రియ, అరుణ మహిళా సాధికారత అంశంగా మాట్లాడారు. కార్యక్రమంలో గంధ్రాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరావు, ప్రధాన కార్యదర్శి నీలం దుర్గారావు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన సామూహిక రమా సత్యనారాయణస్వామి వ్రతాలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ కార్తిక మాసంలో ప్రతి ఒక్కరూ సత్యనారాయణ వ్రతాలు చేసుకోవాలనే సదుద్దేశంతో ప్రతీ ఏటా సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఇక్కడ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

స్టేడియం కిటకిట.. రోడ్లు వెలవెల



ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య అహ్మదాబాద్‌లో ఆదివారం జరిగిన 2023 వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్‌ను బిగ్ స్క్రీన్‌పై తిలకించేందుకు నగర ప్రజానీకం చిన్నా, పెద్దా అంతా వేల సంఖ్యలో ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంకు వచ్చి మ్యాచ్‌ను తిలకించారు. దీంతో స్టేడియం కిటకిటలాడిపోయింది. మరో పక్క క్రికెట్ ఫీవర్‌తో స్టేడియంలో చూసేవారితో పాటు మిగతా వారంతా ఇళ్లలో టీవీలకు అతుక్కుపోవడంతో నగరంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



వన సమారాధనలతో అనుబంధాలు బలపడతాయి

విజయవాడరూరల్: వన సమారాధనలతో అనుబంధాలు బలపడతాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నున్న గ్రామంలోని చినకంచిలో అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్తిక వన సమారాధనలో ఎమ్మెల్యే విష్ణు ఆదివారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మన సంస్కృతీ సాంప్రదాయాలకు అనుగుణంగా కార్తిక మాసంలో ఉసిరి చెట్టుకు పూజలు చేస్తే మంచి జరుగుతుందన్నారు. ఉసిరి చెట్టుకు కార్తిక దామోదర పూజలను అమరావతి బ్రాహ్మణసేవా సంఘానికి చెందిన దంపతులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శివకేశవులకు ప్రీతికరంగా ప్రత్యేక పూజలు చేసి, వనభోజనాలను చేశారు. పిల్లలు, మహిళల ఆనందోత్సాహాలతో చినకంచిలో పండుగ వాతావరణం నెలకొంది.



ఉసిరి చెట్టుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు